క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాల్కొండ: మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన దొన్సల్ నవీన్‌కు మంజూరైన రూ. 52వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ మంగళవారం అందజేశారు. చెక్కు మంజూరుకు కృషి చేసిన డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డికి నవీన్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామికి నివాళులు



వేల్పూర్: మండలంలోని రామన్నపేట్‌లో మంగళవారం పెరియార్ రామస్వామి 51వ వర్ధంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డి బాబురావు, సీహెచ్ గంగాధర్, దార్ల వినోద్, బండి విజయ్, దార్ల కవిత, మాణిక్‌రావు, ప్రకాశ్ పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు జీవన భృతి పెంచాలి

బాల్కొండ: బీడీ కార్మికుల జీవన భృతిని రూ. 4016కు పెంచాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్తెన్న మాట్లాడుతూ.. బీడీ కార్మికులకు జీవన భృతిని పెంచాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా బీడీలు చేసే కార్మికులకు జీవన భృతిని అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



నవీపేట: మండలంలోని రాంపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు చిన్నుల పోశెట్టి చికిత్స పొందుతూ మృతిచెందగా ఆయన అంత్యక్రియలకు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్సీ కవితతో పాటు బీఆర్ఎస్ నాయకులు రూ. 30వేల ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌రావు, అబ్బన్న, తెడ్డు పోశెట్టి, దొంత ప్రవీణ్, గైనిమోహన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ సిస్టంపై అవగాహన




నందిపేట్: మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో మంగళవారం 3డీ ప్లానెటోరియం షో, రోబో చాంప్ ప్లానెటోరియం స్టెమ్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోలార్ సిస్టంపై అవగాహన కల్పించారు. ఇందులో 3డీ వ్యూ సంబంధించి అంశాలతో పాటు సోలార్ సిస్టం పనిచేసే విధానాన్ని చిత్ర ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గోజూర్ అరుణ్, ప్రిన్సిపాల్ కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాపిరమిడ్ ధ్యానంలో పడగల్ వాసులు

వేల్పూర్: రంగారెడ్డి జిల్లా కర్తాల్ మండలం కైలాసపురి మహేశ్వరంలో కొనసాగుతున్న మహాపిరమిడ్ ధ్యానంలో వేల్పూర్ మండలం పడగల్ గ్రామస్తులు పాల్గొన్నారు. ఈనెల 21న ప్రారంభమైన ధ్యానం, సాంస్కృతిక కార్యక్రమాలు 30 వరకు కొనసాగుతాయని వెల్లడించారు. జిల్లా పిరమిడ్ ట్రస్టు అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి, ఆర్మూర్ ట్రస్టు చైర్మన్ తిరుమల గంగారాం ఆధ్వర్యంలో తరలివెళ్లినట్లు తెలిపారు.

క్షేత్ర పర్యటనలో విద్యార్థులు



పెర్కిట్: మామిడిపల్లి కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని అంకాపూర్‌లో క్షేత్ర పర్యటన చేశారు. విద్యార్థులు అంకాపూర్‌లో సాగు చేస్తున్న పంటలను, విత్తనశుద్ధి కర్మగారాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ మిన్హాజ్, డైరెక్టర్లు విజయ్ కర్తన్, నాగేశ్వర్ రావు, మోసిన్ జాబ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు చర్చీల ముస్తాబు



పడగల్‌లో ముస్తాబైన సీఎస్ఐ చర్చి

వేల్పూర్/ మాక్లూర్/ బోధన్‌టౌన్/ ఆర్మూర్‌టౌన్: క్రిస్మస్ వేడుకలకు చర్చీలు ముస్తాబయ్యాయి. ఆర్మూర్, బాల్కొండ, నియోజకవర్గాల్లోని అన్ని చర్చీలు రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

వేల్పూర్ మండలలోని పడగల్, వేల్పూర్ గ్రామాల్లో ఉన్న సీఎస్ఐ, మోతె, పచ్చలనడ్కుడ, వెంకటాపూర్‌లో ఉన్న జీసస్ లవ్స్ గాస్పల్, జాన్కంపేట్‌లో ఇండిపెండెంట్ బాప్టిస్టు చర్చీలను క్రిస్మస్ వేడుకలకు అందంగా ముస్తాబు చేశారు. జీసస్ పుట్టినరోజును తెలిపే విధంగా చర్చీల ఆవరణలో పశువుల పాకలను ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వారం రోజుల నుంచి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పాస్టర్లు దైవ సందేశం వివరిస్తున్నారు.

మాక్లూర్ మండలంలోని జ్యోతినగర్, మెట్టు, మాణిక్‌బండార్, వడ్యాట్‌పల్లి, గుత్ప, గద్వాల్ క్యాంప్, కల్లెడి, బోర్గాం(కె), కొత్తపల్లి గ్రామాల్లోని చర్చీలు విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేపడుతున్నారు.

బోధన్‌లోని ఆచన్‌పల్లి సీఎస్ఐ చర్చి, సెయింట్ పీటర్స్ చర్చితో పాటు పట్టణంలోని మరో ఆరు చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. ఆర్మూర్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఉన్న సీఎస్ఐ చర్చిని అందంగా ముస్తాబు చేశారు.



బోధన్‌లోని ఆచన్‌పల్లి సీఎస్ఐ చర్చి



విద్యుద్దీపాల అలంకరణలో జ్యోతినగర్ చర్చి



ఆర్మూర్ సీఎస్ఎఐ చర్చి



మాక్లూర్‌లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



మోతెలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు

ఇంటర్‌లో హాజరు శాతం పెంచేలా..

- కళాశాలకు హాజరు కాని విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధ్యాపకులు



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న అధ్యాపకుడు

మోర్తాడ్: ఇంటర్ చదువుతున్న విద్యార్థులు తరగతులకు హాజరు కాకపోవడంతో వారిలో మార్పు తీసుకొచ్చే దిశగా అధ్యాపకులు అడుగులు వేస్తున్నారు. వార్షిక పరీక్షలకు సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులను, వారి కుటుంబ సభ్యులను అధ్యాపకులు కలిసి కళాశాలకు వచ్చేలా అవగాహన కల్పిస్తున్నారు. మోర్తాడ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు తరచూ తరగతులకు హాజరు కావడం లేదు. ఇలాగే పరిస్థితి కొనసాగితే ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గిపోతుంది. ఫలితంగా కళాశాలకు చెడ్డ పేరు వస్తుందనే ఉద్దేశంతో అధ్యాపకులు ఎక్కువ రోజులు తరగతులకు డుమ్మా కొట్టిన విద్యార్థుల జాబితా తీసుకుని వారి ఇళ్లకు వెళ్తున్నారు. తరగతులకు హాజరు కావాలని అవగాహన కల్పిస్తున్నారు. కళాశాలకు రావాలంటు విద్యార్థులకు నచ్చచెబుతున్నారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాల్లోని విద్యార్థులకు మోర్తాడ్ కళాశాలలో ఇంటర్ చదువుతుండగా అన్ని గ్రూపుల్లో హాజరుశాతం పెరిగేలా అధ్యాపకులు కృషి చేస్తుండటం విశేషం.

పోస్టర్ల ఆవిష్కరణ



పెర్కిట్: మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం భాషా పండితుల కృతజ్ఞత సభకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. హిందీ పండితుల సంఘం జిల్లా అధ్యక్షుడు జమీరుల్లా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హిందీ, తెలుగు, ఉర్దూ భాషా పండితులకు పదోన్నతులు కల్పిస్తూ 24 ఏళ్ల కల నెరవేర్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞత తెలుపుతూ ఈ నెల 29న జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్, సౌడ రవి, భాను ప్రకాశ్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి



డొంకేశ్వర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



చేపూర్‌లో ..



నందిపేటలో..

డొంకేశ్వర్/ పెర్కిట్/ నందిపేట్: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఇటీవల రాజ్యసభలో అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు మంగళవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశరం భూమేశ్ రెడ్డి, దేగాం గంగారెడ్డి, సుమన్, గంగాధర్, గోపిగౌడ్, బాపురావు, సుంకరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ మండల అధ్యక్షుడు సురకంటి చిన్నారెడ్డి డిమాండ్ చేశారు. అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆర్మూర్ మండలం చేపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీలు జన్నెపల్లి గంగాధర్, ఎల్క రంజిత్, సాక్కం సంజీవ్, సాయన్న, చిట్యాల పోశెట్టి, కంపదండి వినోద్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం నందిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, నాయకులు ఇసూబ్, దమ్మాయి శ్రీను, రాజేందర్, దేవీదాస్‌గౌడ్, వైఎస్ గంగాధర్, జమీల్, తుక్కన్న, హైమద్, ఎర్రం లింగం, శంకర్, మాన్పూర్ భూమేశ్, మజారొద్దీన్, రఫీక్, దశరథ్, ప్రవీణ్, కిషన్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందరమ్మ ఇళ్ల సర్వే



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ శేఖర్ మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని 32వ వార్డులో సర్వేయర్లు చేపడుతున్న సర్వేను పరిశీలించి సర్వేను సక్రమంగా చేపట్టాలని సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట వార్డు ప్రత్యేకాధికారులు వీణ, శ్రీనిత పాల్గొన్నారు.

వీఆర్‌ఈసీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్‌లో ఉన్న వీఆర్‌ఈసీలో మంగళవారం విజయ్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, హెటిరో డ్రగ్స్ ఫార్మసీ సంయుక్తంగా క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కళాశాల విద్యార్థుల కెరీర్‌ను దృష్టిలో వారికి ఉద్యోగాలు కలిపించే దిశగా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- సబ్ కలెక్టర్ వికాస్ మహతో



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సబ్ కలెక్టర్

బోధన్: విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు, సౌకర్యాలు అందించేందుకు ముందుంటామని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని దయానంద గోశాలలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పెన్షనర్స్ డే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పొతంగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ భవనంలో వయో వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం గదిని కేటాయిస్తామని, ఇందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏటీవో పుష్పలత మాట్లాడుతూ.. తన పరిధిలోని పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. పలువురు విశ్రాంత ఉద్యోగులను సబ్ కలెక్టర్, అతిథులు సన్మానించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ అంకు సంధ్యదామోదర్, మదన్ మోహన్, కృష్ణారావు, జ్ఞానేశ్వర్, పార్శి ప్రకాశం, సత్యానందం, అడ్డంకి ఉషన్, ఈవీఎల్ నారాయణ, సిర్ప హన్మాండ్లు, సిర్ప లింగం, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో క్రిస్మస్ వేడుకలు

బోధన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మంగళవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీఎం శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి



బోధన్: సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ భారతీయ విద్యార్థి సేన డివిజన్ కమిటీ అధ్యక్షుడు లింగం ఆధ్వర్యంలో నాయకులు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 18 ఏళ్లుగా అంకితభావంతో పని చేస్తూ.. పాఠశాల విద్యాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేక పోవడం దారుణమని అన్నారు. వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. నాయకులు ఆకాశ్, అక్షయ్, గణేశ్, ఉదయ్, కిరణ్, వికాస్, సిద్ధు, శివ, భూమేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్.. పసుపు బోర్డు ఎక్కడ?

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట్ అన్వేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

ఆర్మూర్: నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటుపై ప్రధాని మోదీ ద్వారా హామీ ఇప్పించిన ఎంపీ ధర్మపురి అర్వింద్.. పసుపు బోర్డు ఎక్కడుందో చెప్పాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట్ అన్వేష్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ అర్వింద్ రెండు సార్లు ఎంపీ ఎన్నికల్లో పసుపు బోర్డును జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తానని రైతులకు మోసపూరితమైన హామీ ఇచ్చి ఎన్నికయ్యాడని అన్నారు. పసుపుబోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి గెజిట్ విడుదల చేసినా ఇంకా కార్యరూపం దాల్చేదన్నారు. ఎన్నికల్లో అర్వింద్ ఇచ్చిన పసుపు బోర్డు హామీ ఏమైందన్నారు. సప్లై డిమాండ్ పరంగా కాకుండా నిలకడమైన ధర రైతులకు కావాలన్నారు. జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయకుండ, ఎంఎస్‌పీ నిర్ణయించకుండ రైతులను ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీలు పసుపు బోర్డు విషయంలో కేంద్ర మంత్రులతో మాట్లాడి ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యాక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, వైస్‌చైర్మన్ విఠం జీవన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరిస్తే ప్రజా ఆగ్రహం తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

కమ్మర్‌పల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరిస్తే ప్రజా ఆగ్రహం తప్పదని సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియెట్ సభ్యుడు వి ప్రభాకర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ సాగు చట్టాలను రద్దు చేస్తామని, పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేస్తామని మోదీ హామీ ఇచ్చి విస్మరించారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు కల్పించాల్సిన పనిదినాలను తగ్గించి కూలీల పొట్టకొడుతున్నారని ధ్వజమెత్తారు. రైతులు, కూలీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకోకుంటే పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు రామకృష్ణ, సారా సురేశ్, రమేశ్, కిషన్, సత్తెవ్వ, రాజేశ్వర్, నరేందర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



నందిపేట్: మండలంలోని శాపూర్‌లో బుధవారం శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు మంగళవారం పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్, పిట్ల కృష్ణ మహరాజ్, శివనంద భారతి స్వామి, సదానంద మహరాజ్ ఆధ్వర్యంలో జరుగుతాయని అన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, నవగ్రహ ఆరాధన, యజ్ఞం, యంత్ర ప్రతిష్ఠ, బలిప్రదానం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



బోధన్‌టౌన్: పట్టణంలోని అమృతాదిత్య చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన క్యాలెండర్‌ను ఏసీపీ శ్రీనివాస్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిట్ ఫండ్ చైర్మన్ కొయ్యాడ శ్రీనివాస్, డైరెక్టర్లు బుర్క శంకర్‌గౌడ్, నరేశ్ అప్పా, ప్రసాద్, ప్రతాప్‌గుప్తా, ఎల్లమయ్య పాల్గొన్నారు.

సన్మానం..



ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని జెండాగల్లీలో ఉన్న జెంటిల్‌కిడ్స్ పాఠశాలలో మంగళవారం విద్యార్థుల నానమ్మ, తాతయ్యలకు యాజమాన్యం ఆటల పోటీలు నిర్వహించింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గుజరాతి ప్రకాశ్, ప్రిన్సిపాల్ లత, విద్యార్థులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	బేబీజాన్(హిందీ)-11.00 2.30 6.00యుఐ(తెలుగు)-10.20 యుఐ(తెలుగు)-9.30
స్క్రీన్-2 –	శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ -11.00, 4.40, 7.25 10.10 యుఐ(తెలుగు)-1.45
స్క్రీన్-3–	ముఫాసా(తెలుగు)-10.40, 1.30, 4.20, 7.10, 10.00
స్క్రీన్-4	పుష్ప-2(తెలుగు) -10.05 2.10 6.15 10.20

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	బచ్చల మల్లి (తెలుగు)-10.20 శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్-1.30 బేబీజాన్(హిందీ)-4.05 పుష్ప-2(తెలుగు)-7.00 యుఐ(తెలుగు)-10.35
స్క్రీన్-2	యుఐ(తెలుగు)-1.20 పుష్ప-2(తెలుగు)-4.00 బేబీజాన్(హిందీ)-7.35 శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్-10.20
స్క్రీన్-3	ముఫాసా(తెలుగు)3డీ-11.00, 5.00,7.35 పుష్ప-2(తెలుగు)-1.10,10.00

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-11.15 6.10 ముఫాసా(3డీ ఇంగ్లీష్)-3.20 బరోజ్-3డీ(తెలుగు)-10.15
స్క్రీన్-2	ముఫాసా(3డీ తెలుగు)-10.30, 1.20,7.35 బరోజ్-3డీ -4.10 పుష్ప-2 (హిందీ)-10.20
స్క్రీన్-3	బేబీజాన్(హిందీ)-11.35,7.10, 10.40 పుష్ప-2(హిందీ)-3.05
స్క్రీన్ -4	శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ -10.30 1.15 8.05 ,పుష్ప-2 -4.00 యుఐ(తెలుగు)-10.50

లలితామహల్	యుఐ(తెలుగు)-11.15 2.15 విడుదల పార్ట్-2(తెలుగు)-6.15,9.15
దేవి	బచ్చల మల్లి తెలుగు)
నటరాజ్	విడుదల పార్ట్-2(తెలుగు)- 11.15,2.15 ముఫాసా(తెలుగు)- 6.15,9.15
విజయ్	పుష్ప-2 (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,100	వెండి(కిలో)	92,500
22 క్యారెట్స్	72,982		

– నిజామాబాద్ బిజినెస్